

వదలని వాన

నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- 8లో



నడిరోడ్డుపై నరకం..!

రాజాం - శ్రీకాకుళం రోడ్డులో ఆనందపురం వద్ద బుధవారం ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనచోదకులు నరకయాతన పడ్డారు.

- 8లో

శక్తియాప్‌పై అవగాహన

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు సబ్ డివిజన్ల పరిధిలో శక్తి బృందాలు విద్యార్థినులు, మహిళలకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించాయి. శ్రీకాకుళం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ' ఫ్లెక్సీని ప్రదర్శించారు. ప్రయాణికులు, విద్యార్థినులకు యాప్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు హెచ్‌ఎంలకు పదోన్నతి కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లలో ఖాళీగా ఉన్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అర్హత కలిగిన, ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లు/తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులకు గురువారం పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత (బాలుర)పాఠశాల వేదికగా ఉదయం 8 గంటలకు ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో ఉన్న టీచర్లు సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో హాజరుకావాలని కోరారు.

ఆస్పత్రిలో సేవలపై ఆరా



ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి కల్యాణ్‌బాబు సూచించారు. నరసన్నపేట ఏరియా ఆసుపత్రిని బుధవారం సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని.. ఇదే సమయంలో పిల్లలు నొప్పులకు భరించలేకపోతున్నారని, వెంటనే ఆపరేషన్ చేయాలని వైద్యులపై ఒత్తిడి తీసుకురావద్దన్నారు. నరసన్నపేటలో 21 మంది వైద్యులు ఉన్నారని, వీరి సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ రమణమూర్తి, ఆఫీస్ సూపరింటెండెంట్ కాశీచరణ్, వైద్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు తప్పని పాట్లు



సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన దివ్యాంగులు

నరసన్నపేట: దివ్యాంగులకు సదరం పాట్లు తప్పడం లేదు. సారవకోట మండలంలోని వివిధ గ్రామాల దివ్యాంగులు బుధవారం వ్యయప్రయాసలకు ఓర్చి ఉదయం 9 గంటలకే నరసన్నపేట ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే వీరి అటెండెన్స్ తీసుకోవాల్సిన గుప్పెడుపేట సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌ను సాధారణ విధులకు కేటాయించడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండక తప్పలేదు. విషయం తెలుసుకున్న డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబు డిజిటల్ అసిస్టెంట్‌ను రప్పించి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయించారు.

ఉత్సాహంగా బల ప్రదర్శన పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారిణి

పొందూరు: బురిడికంచరాం బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. 46 అడుగుల అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రతిష్టాపన సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వెయిట్ లిఫ్టర్ ఇప్పిలి అప్పన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ మహిళా విభాగంలో డి.హేమశ్రీ, పురుష విభాగంలో ఆవాల గోవిందరావు విజేతలుగా నిలిచారు. సంగిడీ పోటీల్లో ఒప్పంగి సత్యనారాయణ, విసురుగుండు పోటీల్లో ఆవాల గోవిందరావులు విజయం సాధించి బహుమతులు గెలుచుకున్నారు.

శిక్షణతో స్వయం ఉపాధి

ఆమదాలవలస: యువతకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని కె.వి.కె. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలసలో కృషి విజ్ఞాన కేంద్రం, సీతంపేట గిరిజన అభివృద్ధి సంస్థ సంయుక్తంగా 'ప్రోట్రే' విధానంలో నారు మొక్కల విధానంపై గిరిజన యువ రైతులకు నైపుణ్య శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్, కె.వి.కె. శాస్త్రవేత్తలు అనూష, బాలకృష్ణ, జి.ఎస్.రాయ్, సునీత, కిరణ్, కొత్తూరు, భామిని, సీతంపేట మండలాల గిరిజన రైతులు,పాల్గొన్నారు.



యువ రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



రూపురేఖలు మార్చి..
రాష్ట్రస్థాయికి చేర్చి..



నాడు -నేడు పనులు చేయక ముందు పాఠశాల

ఒకప్పుడు జి.సిగడాం మండలం ఆనందపురం ప్రాథమికోన్నత పాఠశాల అంటే అందరికీ గుర్తొచ్చేది.. చుట్టూ మురుగునీరు నిండిన ఓ సర్కారు బడి మాత్రమే. ఎంతమంది పాలకులు వచ్చినా పాఠశాల దుస్థితిని, వర్షం పడిన తర్వాత బడిని చుట్టుముట్టే మురుగును తప్పించలేకపోయారు. ఈ సమస్యకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే పరిష్కారం చూపారు. నాడు–నేడు పథకం కింద బడి రూపురేఖలు సమూలంగా మార్చేశారు. అంతేకాకుండా 2022లో రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు 68 పాఠశాలలను ఎంపిక చేయగా ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్ విభాగంలో ఇదే పాఠశాల అవార్డు సైతం దక్కించుకుంది. ఈ ఒక్క పాఠశాలే కాదు జిల్లాలోని వందలాది ప్రభుత్వం పాఠశాలల తలరాతలను మార్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారుదే. - జి.సిగడాం



ఇదీ జగన్ మార్క్

● 39 నిమిషాల్లో ఆరోగ్యశ్రీ కార్డు

నాడు క్షణాల్లో

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య పోరాటం చేస్తున్న యువకుడు విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో స్ట్రెక్చర్‌పై అచేతనంగా పడి ఉన్నాడు. శస్త్ర చికిత్స చేయాలంటే ఆరోగ్యశ్రీ కార్డు ఉండాలి. కానీ ఆ కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో రూ.లక్షా 30వేలు చెల్లిస్తేనే ఆపరేషన్, చికిత్స ప్రారంభిస్తామని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు హతాశులయ్యారు. వెంటనే గ్రామ సచివాలయానికి వెళ్లారు. దరఖాస్తు చేసుకున్న 39 నిమిషాల్లో ఉచిత శస్త్ర చికిత్సకు అవసరమైన 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' కార్డు మంజూరు కావడంతో ఆ కుటుంబ సభ్యులకు కొండంత అండగా లభించినట్లయ్యింది. 2023 జనవరి 23న జరిగిన ఈ సంఘటనను తలచుకొని ఇప్పటికీ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాడు ఇచ్ఛాపురం పట్టణం ఫకీరుపేట వార్డు సచివాలయానికి చెందిన వలంటీర్ వశ్రి సింహాచలం. ఇదీ ప్రజారోగ్యమే పరమావధిగా సాగిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన తీరుకు మచ్చుతునక. - ఇచ్ఛాపురం రూరల్





39 నిమిషాల్లో మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డు (ఇన్‌సెట్లో) శస్త్ర చికిత్స అనంతరం సింహాచలం

● ఏడాదిగా తిరుగుతున్నా..

నేడు కక్షలతో..

కనుగులవలస గ్రామానికి చెందిన సీపాన ఆనందరావుకు రెండు కళ్లు కనిపించవు. 2019 నుంచి దివ్యాంగ పింఛన్ అందుకునేవాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాయకులు కక్షపూరిత చర్యలకు దిగారు. ఆనందరావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు వేశాడన్న కక్షతో 2024 ఆగస్టు నుంచి పింఛన్ నిలిపివేశారు. ఇదేంటని ప్రశ్నించినా పట్టించుకునే వారే కరువయ్యారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి నుంచి 100 శాతం బ్లైండ్ అని సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నా ఫలితం లేకపోయింది. ఎంపీడీఓ కార్యాలయ అధికారులపై ఒత్తిడి పెంచి పింఛన్ అందకుండా తాత్సారం చేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో రీ వెరిఫికేషన్ చేస్తామని బాధితుడికి చెప్పగా రిమ్స్ ఆసుపత్రి నుంచి ఆ నెలలోనే వైద్యులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని అందించినా ఫలితం శూన్యం. ఎప్పటికప్పుడు కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లి వినతిపత్రాలు అందిస్తునే ఉన్నారు. ఇటీవల కోర్టును సైతం ఆశ్రయించాడు. ఇప్పటికైనా పింఛన్ పునరుద్ధరించాలని కోరుతున్నాడు. ఇదీ చంద్రబాబు ఏడాది పాలన మార్కు. - ఆమదాలవలస



సీపాన ఆనందరావు, అంధుడు



ఎంత తేడా బాబూ!



రాక్షస రాజకీయ కుట్రలతో పల్లె తల్లడిల్లుతోంది. ఐదేళ్ల కిందట ఊరి ఒడిలో పురుడు పోసుకున్న సచివాలయం అనాథలా మారిపోయింది. అన్నదాతతో అనుబంధం పెంచుకున్న రైతు భరోసా కేంద్రం నిర్జీవమైపోయింది. ఊరి ఆరోగ్యాన్ని బాగు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ అంపశయ్యకు చేరుకుంది. సామాన్యుడికి సాయం చేసిన వలంటీరు వ్యవస్థకు ఏకంగా సమాధి పడింది. పేదల ఇంటి వద్దకే బియ్యం పంపించలేమా.. అన్న వైఎస్ జగన్ ఆలోచనతో మొదలైన రేషన్ బండి.. బియ్యం కోసం ఆ మాత్రం దూరం వెళ్లి నిలుచోలేరా.. అన్న చంద్రబాబు ఆలోచనతో ఆగిపోయింది. ఏడాది కూటమి పాలనలో జనాల కళ్లుగప్పుతున్న మీడియా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారాల మధ్య ఈ నిజాలు నిప్పుల్లా రగులుతున్నాయి.

ఘొల్లుమంటున్న పల్లె..!



జనాలు లేకపోవడంతో కళతప్పిన కిల్లిపాలెం సచివాలయం

అరసవల్లి:

ఐదేళ్ల కిందట.. పల్లెలో ఓ విప్లవం మొదలైంది. గ్రామ స్వరాజ్యం అన్న కలను సాకారం చేస్తూ చరిత్ర ఎరుగని రీతిలో ప్రతి గ్రామంలోనూ పక్కా ప్రభుత్వ భవనాలు పురుడు పోసుకున్నాయి. ఊరు అంటే గుడి, బడి, పంచాయతీ భవనం అన్న మాట నుంచి ఊరంటే గుడి బడితో పాటు సచివాలయం, రైతు భరోసా కేంద్రం అన్న నానుడిని శాశ్వతం చేశారు. సచివాలయాలు, ఆ పక్కనే రైతుల సేవలకు రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య సేవల కోసం విలేజి హెల్త్ క్లినిక్‌తో పాటు నాడు–నేడు పథకంలో రూపురేఖలు మారిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు పూర్తి స్థాయిలో నిర్మితమై దర్శనమిచ్చాయి. దేశమంతా తల తిప్పి చూసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమం అందింది. మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్యం అంటే ఇదే అన్నట్లుగా గ్రామ పాలన సాగింది.

మరి ఇప్పుడో..

సచివాలయ వ్యవస్థను పూర్తిగా నీరు గార్చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందించడం గతంలా మారిపోయింది. గ్రామ వలంటీర్లు కనుమరుగైపోయారు. రైతు భరోసా కేంద్రాలకు తాళాలు పడ్డాయి. విలేజిహెల్త్ క్లినిక్‌ల సేవలను దఫదఫాలుగా నిలిపివేస్తున్నారు. ఇక పాఠశాలలో పిల్లలకు మంచి ఆహారం అందించే నాథుడే లేకపోయాడు. ఒక్క పింఛన్లు తప్ప మరే ఇతర లబ్ధి లేకుండా జనం అవస్థలు పడుతున్నారు. లబ్ధి కూడా 'పసుపు' చొక్కాలకు మాత్రమే. ఆఖరుకు అత్యధిక గ్రామాల సర్పంచ్‌లు వైఎస్సార్ సీపీ మద్దతుదారులనే కారణంతో ఎలాంటి కార్యక్రమాలకు వారికి ఆహ్వానం లేకుండానే అవమానాలకు గురిచేస్తున్నారు. పదుల సంఖ్యలో సర్పంచ్‌లకు చెక్‌పవర్లు కూడా రద్దు చేసేసి కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారు. అలాగే గత ఐదేళ్లలో కనిపించని బెల్ట్ షాపులు ఊరు ఉసురు తీస్తున్నాయి. కక్షపూరిత పాలనతో ప్రతిపక్ష మద్దతుదారుల ఆస్తులపై దాడులు జరుగుతున్నాయి.

- కళ తప్పిన పంచాయతీలు
- రాజకీయ కుట్రలకు బలైపోతున్న గ్రామాలు
- ప్రాధాన్యత కోల్పోయిన సచివాలయాలు
- కనుమరుగైపోయిన వలంటీర్లు
- కూటమి ఏడాది పాలనలో కన్నీరు పెడుతున్న పల్లెలు



ఏడాది పాలన ఇదేనా బాబూ..

కళ కోల్పోయిన సచివాలయం..

రూరల్ గవర్నెన్స్ ద్వారా ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలనే ధ్యేయంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. మొత్తం 912 పంచాయతీల్లో మొత్తం 657 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల్లో రెగ్యులర్ ఉద్యోగులు 5839 మందిని నియమించారు. సుమారు 523 వరకు వివిధ రకాల సేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు కళ కోల్పోయాయి. వైఎస్ జగన్‌పై కక్షతో సచివాలయాల్లో ఉచిత సేవలకు మంగళం పాడేసి బయట మీ సేవ కేంద్రాలకు వెళ్లేలా, అలాగే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగేలా వ్యవస్థను మార్చేశారు. గతంలో సచివాలయ ఉద్యోగులు కేవలం సచివాలయాల్లో సేవలందించగా.. వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను అర్హుల చేతికి అందించేవారు. ఇప్పుడు సచివాలయ ఉద్యోగులను ఎప్పుడు పడితే అప్పుడు సర్వేల పేరిట బయటకు పంపించేస్తున్నారు. 15 రకాల సర్వేల పేరిట నిత్యం వేధిస్తున్నారని సాక్షాత్తు సిబ్బందే వాపోతున్నారు. దీంతో సచివాలయాలకు ఎప్పుడు వెళ్లినా బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇదే ప్రాంగణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలదీ అదే పరిస్థితి. రైతులకు ఎలాంటి సూచనలు, సలహాలు, ఆధునికతపై అవగాహన వంటి కార్యక్రమాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక వైద్యం సంగతి సరేసరి. ప్రభుత్వ తీరుతో వైద్యులు కూడా పత్తా లేకుండాపోయారు. దీంతో ఉచిత వైద్య సేవలకు మంగళం పాడే పరిస్థితులు దాపురించాయి.

అంతా 'పచ్చ'పాతమే...


గ్రామాల్లో గత పాలనంతా పారదర్శకంగా సాగింది. ఇప్పుడా పరిస్థితి లేదు. పక్కా ఇళ్లు, పింఛన్లు, అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా, విద్యానేస్తం తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా గత ఐదేళ్ల సంక్షేమ పథకాలు ఠంఛన్‌గా అందేవి. ఇప్పుడు 'పచ్చ' పాతమే కనిపిస్తోంది. అర్హతున్నవారికి కూడా రాజకీయ కక్షతో పింఛన్లు, ఇతరత్రా పథకాలకు దూరం చేసేలా కుళ్లు రాజకీయాలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. రాజకీయ కుట్రలు పేట్రేగిపోయి హత్యలకు కూడా దారితీస్తున్నాయి. దీంతో ప్రశాంతంగా ఉండే పల్లెలు నివురుగప్పిన నిప్పులా కనిపిస్తున్నాయి. ఈ సంవత్సర కాలంలో 90 శాతం హత్యలు గ్రామీణ ప్రాంతాల్లోనే జరిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల అనంతరం వివిధ కారణాలతో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ అనుబంధ సభ్యులపై భౌతిక దాడులతో పాటు హత్యా రాజకీయాలకు కూడా వెనుకాడని పరిస్థితులు నేడున్నాయి.



ప్రకటనలు ఘనం.. చేసింది శూన్యం

వైఎస్ జగన్ హయాంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయి. కానీ నేడు 'అర్హత'కు ప్రామాణికాలు మారిపోయాయి. సూపర్ సిక్స్ హామీల ద్వారా అధికార గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో గ్రామాల్లో చేసిన అభివృద్ధిగానీ, అందించిన సంక్షేమం గానీ శూన్యం. అనుకూల మీడియా ద్వారా ప్రచారాలు ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో జనాలకు లబ్ధి చేకూరింది ఏమీ లేదు.

వలంటీర్ వ్యవస్థకు మంగళం..



ప్రభుత్వానికి తోడుగా జనాలకు సేవలందించేందుకు నియమించిన గ్రామ వలంటీర్లు వ్యవస్థ దేశంలోనే ఖ్యాతి సాధించిన సంగతి విదితమే. నెలకు కేవలం రూ.5 వేల గౌరవ వేతనంతో రౌండ్ ది క్లాక్ విధులు నిర్వర్తించిన వలంటీర్లకు మొక్కని చేతులుండవు. అలాంటి వలంటీర్లకు తాము అధికారంలోకి వస్తే గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామంటూ గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడేసింది. వారి సేవలు అవసరం లేదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటింటికీ పెద్దకొడుకు, కూతురులా ప్రభుత్వ పథకాల లబ్ధిని అందించడంతో పాటు కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ధైర్యంగా సేవలందించిన వలంటీర్లను ప్రభుత్వం పూర్తిగా తొలగించేసింది.

పంచాయతీలు	గ్రామ సచివాలయాలు	రెగ్యులర్ ఉద్యోగులు	అందించిన సేవలు	వాలంటీర్లు
912	657	5839మంది	523	15000



ఆ వెలుగు లేదిప్పుడు..

ప్రభుత్వం అంటే ప్రజలకు అందుబాటులో సేవలందించేలా ఉండాలి. గత ఐదేళ్ల గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఓ వెలుగు వెలిగారు. ప్రజలకు మేలు చేశారు. అన్ని ఇంటికే తెచ్చిచ్చే వ్యవస్థ పనిచేసింది. కూటమి ప్రభుత్వ రాజకీయానికి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు నలిగిపోయాయి. వలంటీర్లు సేవలు నిలిపివేయడంతో ప్రజల్లో ప్రభుత్వంపై విముఖత ఏర్పడిందనే చెప్పాలి. నాటి వెలుగు ఏ మాత్రం గ్రామాల్లో ఇప్పుడు లేదని కచ్చితంగా చెప్పవచ్చు.

- సీహెచ్ రవి, పాత్రునివలస, శ్రీకాకుళం మండలం



సర్పంచ్‌లకు చెప్పకుండానే..

కూటమి ఏడాది పాలనలో గ్రామాల్లో పరిపాలన తీరు దారుణంగా తయారయ్యింది. సర్పంచ్ హక్కులను కాలరాస్తూ నిర్వీర్యం చేసేశారు. మా తీర్మానాలు అవసరం లేకుండానే పనులు చేసేస్తున్నారు. సర్పంచ్‌లకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా పనులు చెయ్యండని అధికార పార్టీ అగ్రనేతలు చెప్పడంతో అధికారులు అదేబాటలో ఉంటున్నారు. రాజ్యాంగపరంగా ఎన్నికైన పాలకులకు సమాచారం చెప్పకుండా, కనీసం గౌరవ మర్యాదలు లేకుండా జరుగుతోంది. కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లకు చెక్‌పవర్లు రద్దు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇదేం పరిపాలనో అర్థం కావడం లేదు.

- మార్పు పృథ్వీ, గ్రామ సర్పంచ్, గార



పూర్తి స్థాయి సేవలు అందేవి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌బీకేల ద్వారా గ్రామంలో రైతులందరూ పూర్తి స్థాయి సేవలు పొందేవారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే వలంటీర్లు, వీఏఏలు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల కోసం సమాచారం సేకరించేవారు. వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందే రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. గత ఖరీఫ్‌లో వేసిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక ఇప్పటికీ కళ్లాల్లోనే ధాన్యం ఉన్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి.

- కణితి రామచంద్రుడు, రైతు, హరిదాసుపురం, నందిగాం మండలం

● జపాన్‌లో జుగల్బంది



శ్రీకాకుళం కల్చరల్ : సిక్కోలు కళాకారులు జపాన్‌లో అద్భుత ప్రదర్శనలు ఇస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున విదేశాలలో భారతీయ సంస్కృతి వైభవాలు చాటిచెప్పేలా మూడు రోజులుగా ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సమగ్రతలో భాగంగా థాయిలాండ్ బృందంతో ప్రదర్శించిన జుగల్బందీ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ బృందంలో నగరానికి చెందిన రామకౌండిన్య, నేహా, వర్షిత, నేహా థామస్, లలిత, చాందిని ఉన్నారు.

17 కేంద్రాల్లో ఆధార్ సేవలు

శ్రీకాకుళం అర్బన్: భారత ప్రభుత్వం తపాలా శాఖ, యూఐడీఏఐ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని 17 కేంద్రాలలో అన్ని రకాల ఆధార్ సేవలు అందిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ వండాన హరిబాబు బుధవారం తెలిపారు. అన్ని వయసుల వారికి కొత్త ఆధార్ నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ఇ–మెయిల్ ఐడీ ఫొటో, వేలిముద్రలు, ఐరిస్ అప్‌డేట్ తదితర సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి ప్రధాన తపాలా కార్యాలయాలతో పాటు రాజాం, పొందూరు, ఎస్‌ఆర్ పురం, జేఆర్ పురం (రణస్థలం), అరసవిల్లి, గార, హిరమండలం, కొత్తూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి, కాశీబుగ్గ, పలాస, సోంపేట, మందస ఉప తపాలా కార్యాలయాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయని, జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

టీచర్లకు బదిలీ కష్టాలు

- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపాటు



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ సాధారణ బదిలీలు గందరగోళంగా మారాయి. ఆదరాబాదరాగా నిర్వహిస్తున్న బదిలీల ప్రక్రియతో టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు మొదలుకొని సాఫ్ట్‌వేర్ మొరాయింపు, ధ్రువపత్రాల అప్‌లోడింగ్ కష్టాలు, స్టేషన్ పాయింట్ల కేటాయింపులో తేడాలు, 5/8 సంవత్సరాలకు మెరిట్ పాయింట్ల కేటాయింపు సరిగాలేకపోవడం, ఎంపికచేసుకునే పాఠశాలలు కనిపించకపోవడం, ఇతర సాంకేతిక సమస్యల కారణంగా మెజారిటీ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే విషయమై పలువురు ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 83 గ్రేడ్–2 హెడ్‌మాస్టర్ల పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు/తత్సమాన ఉపాధ్యాయులతో భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

గుణుపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు



విశాఖ-గుణుపూర్ పాసింజర్(ఫైల్)

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశాలను కలుపుతూ ప్రయాణికులకు సేవలందిస్తున్న విశాఖపట్నం – గుణుపూర్ పాసింజర్ రైలు వేళలు జూన్ 1వ తేదీ నుంచి మార్పు చేశారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు మేరకు తెంబూరు–గుణుపూర్ మధ్య ప్రధానంగా రైలు వేళల్లో మార్పులు జరిగాయి. విశాఖపట్నం – గుణుపూర్ (58506) పాసింజర్ ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి ఉదయం 9.44 గంటలకు తెంబూరు, 9.49 గంటలకు గంగువాడ, 9.59 గంటలకు పాతపట్నం, 10.08 గంటలకు పర్లాకిమిడి, 10.24 గంటలకు సీతాపురం, 10.29 గంటలకు హడ్డుబంగి, 10.39 గంటలకు కాశీనగర్, 10.49 గంటలకు లిహూరి, 10.59 గంటలకు బన్సధార, 11.09 గంటలకు పాలసింగి, 11.55 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్–విశాఖపట్నం (58505) పాసింజర్ మధ్యాహ్నం 1.55 గంటలకు బదులుగా 2.30 గంటలకు గుణుపూర్‌లో బయల్దేరి, 2.40 గంటలకు పాలసింగి, 2.47 గంటలకు బన్సధార, 2.56 గంటలకు లిహూరి, 3.04 గంటలకు కాశీనగర్, 3.15 గంటలకు హడ్డుబంగి, 3.20 గంటలకు సీతాపురం, 3.33 గంటలకు పర్లాకిమిడి, 3.43 గంటలకు పాతపట్నం, 3.52 గంటలకు గంగువాడ, సాయంత్రం 4 గంటలకు తెంబూరు, 4.09 గంటలకు పెద్దసాన, 4.17 గంటలకు చెక్కలి, రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. నూతన సమయాలు ప్రయాణికులు గుర్తించాలని రైల్వే అధికారులు సూచించారు.

దాడి కేసు నమోదు



చికిత్స పొందుతున్న హరికృష్ణ

కవిటి: మండలంలో డి.గొనపపుట్టుగ గ్రామంలోని ఎస్సీ వీధికి చెందిన బోనేల హరికృష్ణపై ప్రత్యర్థి వర్గీయులు దాడిచేసి గాయపర్చడంతో 108 అంబులెన్స్‌లో కవిటి ప్రభుత్వ ఆస్పత్రి వెళ్లాడు. అక్కడి ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు కవిటి పోలీస్‌స్టేషన్‌లో బోనేల హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంఎల్‌సీ కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.రవివర్మ బుధవారం తెలియజేశారు. తన కొబ్బరితోటలో కాయలు, కమ్మలను ప్రత్యర్థి వర్గంవారు తీసుకెళ్తుంటే అడ్డుకున్నాననే నెపంతో కర్రలతో కొట్టి, కారంచల్లి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా ఈ కొట్లాటలో తమకు కూడా గాయాలయ్యాయని ప్రత్యర్థి వర్గీయురాలు తెంబ సరోజిని అనే మహిళ సైతం కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

నిబంధనలు పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్

నరసన్నపేట: మద్యం షాపుల్లో విధిగా నిబంధనలు పాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో పోలీసులు నమోదు చేసిన ఎక్సైజ్ కేసులు, వాటి దర్యాప్తుపై సమీక్షించారు. కేసులు మరిన్ని నమోదు చేయాలని సూచించారు. అలాగే ఉదయం 10 గంటల్లోపు షాపులు తెరవకూడదని, రాత్రి 10 గంటల తర్వాత తెరిచి ఉంచకూడదని హెచ్చరించారు. నిబంధనలు పాటించని షాపులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎక్సైజ్ సీఐ, ఎస్ఐల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఎస్వీ రమణమూర్తి ఉన్నారు.

నడిరోడ్డుపై నరకం..!

- రాజాం – శ్రీకాకుళం రోడ్డులో 6 కి.మీ నిలిచిన ట్రాఫిక్
- అవస్థలు పడిన భక్తులు
- అదుపు చేయలేని పోలీసులు

జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామ దేవత పండగ సందర్భంగా బుధవారం రాజాం – శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 6 కి.మీ దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ నియంత్రించడానికి సరైన పోలీసు సిబ్బంది లేకపోవడం, ప్రధాన రహదారిలో చిన్న వంతెన ఉండడంతో ఇటువంటి ఇబ్బందులు తలెత్తాయి. లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో రాజాం – శ్రీకాకుళం వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా పాలకొండ నుంచి విశాఖ వెళ్లే వాహనాలు చీపురుపల్లి వద్ద వంతెన కారణంగా ఈ మార్గం వైపే నడుపుతున్నారు. ఫలితంగా మరింతగా ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు నడిరోడ్డుపై నరకం చూశారు. అయితే వంతెనపై ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడం వలన నిలిచిపోవడంతోనే ట్రాఫిక్ సమస్య ఎక్కువయ్యిందని ఎస్ఐ వై.మధుసూదనరావు పేర్కొన్నారు.

– జి.సిగడాం



పొందూరు వరకు నిలిచిన వాహనాలు



దవళపేట వరకు నిలిచిపోయిన వాహనాలు



రహదారి మధ్యలో వాహనాలు



రాజాం - శ్రీకాకుళం ప్రధాన రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్

జ్వరభద్రం..!



- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

శ్రీకాకుళం:

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకు విపరీతమైన ఎండవేడిమి ఉండగా, ప్రస్తుతం ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అందువలన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా వారు తొందరగా వ్యాధుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు తినే ఆహారం, తాగేనీరు విషయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చెబుతున్నారు.

ఖాళీ స్థలాలే ఆవాసాలు

జలుబు, దగ్గు, జ్వరం, అతిసారం, వాంతులు వంటి వాటితో పాటు మరిన్ని అంటువ్యాధులు వ్యాప్తి చెందే పరిస్థితి వర్షాల సమయంలో ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణంగా మనం దోమలు, ఈగలను చెప్పవచ్చు. మురికి కాలువులు, ఖాళీ స్థలాలు దోమలు, ఈగలకు ఆవాసాలై వ్యాధులు వ్యాప్తి చేస్తాయి. కొన్ని నెలలుగా కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, పారిశుధ్య పనులు అంతంతమాత్రంగా చేయడం వలన వర్షం పడితే కాలువల్లో మురికినీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అలాగే ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నీరు నిలిచిపోయి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటిపై నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు పట్టించుకోవడం లేదు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడం ఎంతో అవసరం. అలాగే పొరుగు జిల్లా అయిన విశాఖపట్నంలో కరోనా కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. మన జిల్లా నుంచి అనేక మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఇలిసిపురం జంక్షన్‌లో రోడ్డుపైనే డ్రైనేజీ మురుగు

ఇలా చేయాలి

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి.
- వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలి.
- వీలైనంత వరకు రోడ్డుపక్కన తినుబండారాలు తినకపోవడమే మంచిది.
- ఆహారం తీసుకునే ముందు చేతులను పరిశుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తత అవసరం



అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దరిచేరవు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ నిర్ధారణ అయితే ప్రత్యేక చికిత్స అవసరం ఉంటుంది. – డాక్టర్ కె.రవితేజ, శ్రీకాకుళం

ముగ్గురు జేఎల్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి

శ్రీకాకుళం న్యూకాలనీ: జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్ పదోన్నతలకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు మరోసారి చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తాజాగా ముగ్గురు జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా ప్రొసీడింగ్స్ వెలువరించారు. వీరంతా ఏపీపీఎస్సీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జేఎల్స్‌గా నియామకమైనవారు కావడం విశేషం. ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి పొందినవారిలో బి.చంద్రమౌళి (ఫిజిక్స్ లెక్చరర్ – ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల), పి.సౌజన్య (కామర్స్ లెక్చరర్ – శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల), చింతాడ శరత్‌బాబు (జువాలజీ లెక్చరర్– మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల) ఉన్నారు.

వీరికి ఈ రెండు రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహించి జోన్–1 (పునర్విభజనకు పూర్వపు ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో ప్రిన్సిపాల్స్‌గా నియమించనున్నారు. ఇటీవల జిల్లా నుంచి ఐదుగురు జేల్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు లభించిన విషయం తెలిసిందే.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి కొమలాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ లైన్ ఆవుల శాలకు తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించి టొంప సింహాచలంకు చెందిన ఆవు మృతి చెందింది. దీంతో ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తనను ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.

వదలని వాన

- జిల్లాలో విస్తారంగా వర్షాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షాలు రైతులు వేసవి దుక్కులు సులువుగా చేసుకునేందుకు ఉపయోగపడతాయి. అయితే గుంతల రోడ్లలో వాహనాలతో రాకపోకలు సాగించలేక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. కుంటిభద్రలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో గ్రామస్తులంతా ఆ నీటిలో కాగితపు పడవలు వదిలి నిరసన తెలియజేశారు. అలాగే జీడి, మామిడి సైతం పూర్తిగా నేలరాలిపోయి ఉద్యాన రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. చేతికొచ్చిన మామిడి కాయలను ఇతర ప్రాంతాలకు పంపించాలనే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో నష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన ఒకరు, శ్రీకాకుళం నగరంలోని బలగకు చెందిన వ్యక్తి మృతి చెందారు.

– వర్షపాతం ఇలా...

జిల్లావ్యాప్తంగా బుధవారం అత్యధికంగా సంతబొమ్మాళి మండలంలో 152.4 మి.మీ, అత్యల్పంగా కంచిలి మండలంలో 0.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారకంగా తెలియజేశారు.





శ్రీకాకుళం నగరంలో వర్ష బీభత్సం

మండలం	వర్షపాతం (మి.మీ)		
సంతబొమ్మాళి	152.4	శ్రీకాకుళం	82.8
టెక్కలి	139.4	జి.సిగడాం	80
కోటబొమ్మాళి	117.0	నందిగాం	74.2
		పోలాకి	70.6
		సారవకోట	58.2

త్రుటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కొత్తపేట పంచాయతీ కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలనీలో కొండకు ఆనుకుని ఉన్న నీలాపు రామకృష్ణకు చెందిన ఇంట్లోకి మంగళవారం రాత్రి సమయంలో కొండమీద నుంచి వరదనీటితో పాటు కంకర ఒక్కసారిగా పడిపోవడంతో కుటుంబ సభ్యులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. ఇదే కాలనీలో నివాసముంటున్న వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన ఘటన వివరించారు. దీంతో రోజారాణితో పాటు ఆమె భర్త రామకృష్ణారెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం బుధవారం ఉదయం పంచాయతీరాజ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీఈ సుధాకర్‌తో పాటు ఇతర అధికారులు ఇందిరమ్మ కాలనీ వద్దకు చేరుకుని మట్టిని తొలగించే చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ కాలనీలో నివాసాలకు ఆనుకుని కొండమీద అభివృద్ధి పేరుతో రోడ్డు పనులు చేస్తున్నారు. అయితే ముందస్తుగా అధికారులు సరైన ప్రణాళిక చేపట్టకపోవడంతో ఇటువంటి సంఘటన జరిగినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. కొండపైకి రోడ్డు కోసం ఇప్పటికే రెండు ప్రాంతాల్లో పనులు ప్రారంభించారని, ఇప్పుడు ఇళ్లకు ఆనుకుని కొత్తగా రోడ్డు పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కాలనీవాసులు నివసిస్తున్న ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రక్షణ గోడ నిర్మాణం చేపట్టి తదుపరి పనులు చేయాలని కోరుతున్నారు.



ఇంట్లోకి చేరిన కంకర మట్టిని యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం

మహిళా కార్యాలయానికి రక్షణ కరువు



వెలుగు కార్యాలయం ఆవరణలో పగలగొట్టిన మద్యం బాటిళ్లు(ఫైల్)

- ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్న ఉద్యోగులు
- పక్కనే మద్యం దుకాణం ఉండడంతో అవస్థలు

మెళియాపుట్టి: విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు అధికంగా వస్తూపోతూ ఉండే మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి, వెలుగు కార్యాలయాలు గ్రామ శివార్లలో ఉండడం వలన పక్కనే ఉన్న మద్యం దుకాణంలో మద్యం కొనుక్కుని, సాయంత్రం 7 గంటలు దాటాక కొంతమంది మందుబాబులు కార్యాలయాల వరండాల్లో మద్యం సేవిస్తున్నారు. అనంతరం సీసాలు పగలగొట్టడం వంటి వికృత చేష్టలు చేస్తున్నారు. కనీస ఆలోచన లేకుండా మందుబాబులు చేస్తున్న అసభ్య కార్యకలాపాలు ఉద్యోగులను విస్మయానికి గురి చేస్తున్నాయి. సెలవు రోజుల్లో అయితే కార్యాలయాల వద్ద వాహనాలు నిలిపి అక్కడే తిష్ట వేస్తున్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులకు వరండాలపై పగలగొట్టిన మద్యం బాటిళ్లు, అసభ్యమైన చెత్త ఎప్పటికప్పుడు దర్శనమిస్తూనే ఉంటాయని ఉద్యోగులు వాపోతున్నారు. దీనికి కార్యాలయాల పక్కనే ఉన్న మద్యం దుకాణం ఒక కారణమైతే, ప్రహరీ లేకపోవడం మరో కారణమని చెబుతున్నారు. ప్రహరీ నిర్మించాలని ఇదివరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.



ఉపాధి, వెలుగు కార్యాలయ భవన సముదాయం

విలువైన సామాగ్రి కాపాడేదెవరు

వీడీవీకేల ద్వారా కొనుగోలు చేసిన జీడి, ఇతరత్రా ప్రాసెసింగ్ చేసే యంత్రాలు కార్యాలయం బయటే ఉన్నాయి. రూ.లక్షలు విలువ చేసే యంత్రాలకు కూడా రక్షణ లేదు. ప్రహరీ, గేట్ నిర్మాణం చేపడితే ఇబ్బందులు తొలగుతాయని అక్కడి సిబ్బంది చెబుతున్నారు.

పైఅధికారులకు విన్నవించాను

ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ దృష్టికి ప్రహరీ సమస్యను తీసుకెళ్లాను. అలాగే ఇటీవల సాధారణ సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. అత్యవసర సమయాల్లో అధిక సమయం పనిచేసేటప్పుడు చీకటి పడితే కార్యాలయంలో ఉండడానికి భయంగా ఉంటుంది. ప్రహరీ, గేట్ నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయి.
– త్రినాథమ్మ, వెలుగు ఏపీఎం, మెళియాపుట్టి

ఘనంగా జలయాత్ర

పొందూరు మండలంలోని బురిడికంచరాం గ్రామంలో జలయాత్ర, శోభాయాత్రను ఘనంగా బుధవారం నిర్వహించారు. గ్రామంలో గణపతి – సుబ్రహ్మణ్య సహిత శ్రీఅభయాంజనేయ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు కలశాలతో ముర్రాటలను అభయాంజనేయస్వామి దేవాలయానికి సమర్పించారు. అనంతరం పూజలను జరిపారు.

– పొందూరు

